క్లుప్తంగా

భూసర్వేపై వర్క్‌షాప్



తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూసర్వేను విజయవంతం చేసేందుకు సిబ్బంది సహకరించాలని తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి ప్రసన్నలక్ష్మి కోరారు. స్థానిక వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం మూడో విడత భూసర్వేపై డివిజన్లోని రెవెన్యూ, సర్వే సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వివాదాలకు తావులేకుండా సర్వే సజావుగా సాగడానికి సిబ్బంది సమష్టి కృషి చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు నిర్ణీత గడువులోపు సర్వే పూర్తిచేయాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన అనంతరం పాస్‌బుక్‌లు జారీచేయాలన్నారు. డివిజనల్ సర్వే ఇన్‌స్పెక్టర్ సారంగపాణి, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట, ఏకొండూరు, రెడ్డిగూడెం తహసీల్దార్లు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి



చాట్రాయి: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారుల కృషి చేయాలని మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో రెవెన్యూ, హౌసింగ్ ఆరోగ్యం, పోలీస్ శాఖలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 109 సమస్యలను త్వరిగతిన పరిష్కరించాలని ఆయన సూచించారు. ఎంపీడీఓ దుర్గాప్రసాదు, ఈఓపీఆర్‌డీ నాగరాజు, పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్షీరబంధు నగదు అందజేత



రెడ్డిగూడెం: కొత్తరెడ్డిగూడెం పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘ సభ్యుడైన తుమ్మూరు పుల్లారెడ్డి ఇటీవల చనిపోవడంతో క్షీర బంధు పథకం కింద పుల్లారెడ్డి భార్య వీర వెంకమ్మకు రూ.50వేల చెక్‌ను కృష్ణామిల్క్ యూనియన్ డైరెక్టర్ ఉయ్యూరు అంజిరెడ్డి శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ తుమ్మూరు యశ్వంత్, సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, డైరెక్టర్లు అలవాల జమలారెడ్డి, గాదె నరసింహారెడ్డి, డి. శ్రీనివాసరెడ్డి, బి. నర్సీరెడ్డి, టి.బాబిరెడ్డి, జి.వాణి పాల్గొన్నారు.

వెలుగు మిత్ర మృతి

చాట్రాయి: మండలంలోని చనుబండ గ్రామ వెలుగు మిత్ర చికిత్స పొందుతూ మృతి చెందాడు. వెలుగు మిత్ర దుర్గం మురళి (36) వారం క్రితం రోడ్డు ప్రమాదంలో కాలు విరిగింది. ఆయన విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మురళి భౌతికకాయాన్ని సందర్శించి వెలుగు ఏరియా కో ఆర్డినేటర్ రాజశేఖర్, ఏపీఎం శేఖర్, సీసీలు, వెలుగు మిత్రలు నివాళులర్పించారు.

సర్వాయి పాపన్నకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో షిరిడీ సాయిబాబా సేవా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్వాతంత్ర్య ఉద్యమకారుడు సర్దార్ సర్వాయి పాప్పన గౌడ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి పాల్గొన్నారు.

ప్రోత్సాహకాలు అందించడం అభినందనీయం




ముసునూరు: విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించడం అభినందనీయమని, హెచ్‌ఎం పీఎస్‌వీ రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని రమణక్కపేట జెడ్పీ హైస్కూల్లో గతేడాది పదో తరగతి పరీక్షల్లో ఇంగ్లిష్ సబ్జెక్టులో ఉత్తీర్ణులైన 39 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు భద్రపర్చుకునేందుకు ఉపయోగపడే ఫైళ్లను, 10 జీపీఏ సాధించిన ఇద్దరికి నగదు బహుమతులను శుక్రవారం అందజేశారు. పాఠశాల నుంచి ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన పీఈటీ వాణీకుమారి సహకారంతో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత

జి.కొండూరు: మండల పరిధి చెవుటూరు గ్రామానికి చెందిన మొదిలి అర్జున్ (40) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. అతడి కుటుంబ సభ్యులకు తక్షణ ఆర్థికసాయంగా వైఎస్సార్ బీమా నుంచి మంజూరైన రూ.10 వేలను సర్పంచ్ పిన్నిబోయిన శ్రీదేవి చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవార పూజలు



నెమలిలో రాజ్యలక్ష్మి దేవికి శాకంబరి అలంకరణ



తిరువూరు అష్టలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు



గంపలగూడెంలో నిమ్మకాయలతో అలంకరణ



విస్సన్నపేటలో లక్ష్మీదేవి అలంకారంలో అమ్మవారు

తిరువూరు: శ్రావణమాసంలో తొలి శుక్రవారం తిరువూరు పట్టణంలోని పలు ఆలయాల్లో మహాలక్ష్మీదేవికి విశేష పూజలు నిర్వహించారు. రాజుపేట అష్టలక్ష్మి అమ్మవారి ఆలయంలో కుంకుమపూజలు, అష్టోత్తర శతనామార్చనలను ఆలయ ప్రధానార్చకులు కాసులనాటి పద్మనాభశాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీకనకదుర్గాలయం, శ్రీగౌరీ కేదారేశ్వరాలయం, పీటీకొత్తూరు రామాలయం, శ్రీసంతోషిమాత ఆలయాల్లో జరిగిన శ్రావణ శుక్రవార పూజల్లో మహిళా భక్తులు పాల్గొన్నారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి శాకంబరి అలంకరణ

నెమలి(గంపలగూడెం): గంపలగూడెం మండలం నెమలిశ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా రాజ్యలక్ష్మి అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందంతో అమ్మవారికి వివిధ రకాల కూరగాయాలతో ఆలంకరించి ప్రత్యేక పూజలు, కుంకుమార్చన జరిపారు.

గ్రామదేవతకు నిమ్మకాయలతో అలంకరణ

గంపలగూడెం: గంపలగూడెంలో గ్రామదేవత ముత్యాలమ్మ ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం చేసి నూతన వస్త్రాలు, నిమ్మకాలతో ప్రత్యేక అలంకరణ చేసి పూజలు జరిపారు. భక్తులు అమ్మవారిని విశేషంగా దర్శించుకున్నారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: శ్రావణమాసం మొదటి శుక్రవారం సందర్భంగా స్థానిక ద్వారకానగర్‌లో ఉన్న కనకదుర్గా అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారిని లక్ష్మీదేవిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఏసీపీ రమేష్

మైలవరం: దాతల సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏసీపీ ఎం.రమేష్ తెలిపారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ మేడసాని కిషోర్‌కుమార్ కుమారుడు చిద్విల్ సాయి పుట్టినరోజును పురస్కరించుకుని మైలవరం పొందుగల రోడ్డులోని నంబర్-4 ఎంపీపీ పాఠశాల, జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యార్థుల సౌకర్యార్థం ఎలక్ట్రికల్ బెల్, బ్లూ టూత్ స్పీకర్‌ను ఏసీపీ రమేష్ ద్వారా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో మైలవరం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, కార్యదర్శి హరీష్‌కుమార్, కోశాధికారి దినేష్ బాబు, సభ్యులు రంగారావు, వెంకటేష్, రాము, ఏడుకొండలు పాల్గొన్నారు.

పత్తి పంట దిగుబడికి జీవామృతం



పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

చంద్రగూడెం(మైలవరం): పత్తి పంట దిగుబడికి ద్రావ జీవామృతం బాగా ఉపయోగపడుతుందని ఏఓ సంధ్యారాణి తెలిపారు. మైలవరం మండలం చంద్రగూడెంలో పత్తి పంటలో పొలం బడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ద్రావ జీవామృతం ఉపయోగించడం వలన మొక్క పెరుగుదలకు, తెగుళ్ల రక్షణకు ఉపయోగపడుతుందన్నారు. ద్రావ జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. అనంతరం పొలం గట్లపై సరిహద్దు పంటలుగా వేసుకునేందుకు రైతులకు కందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఏఏ వజ్రకుమార్, రాము నాయక్, ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి శాంతికుమారి పాల్గొన్నారు.

మైలవరంలో పట్టుకోల్పోతున్న దేవినేని ఉమా



రింగ్‌సెంటర్‌లో మాజీ మంత్రి దేవినేని ఉమా లేకుండానే గన్నే ప్రసాద్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఇబ్రహీంపట్నం: మైలవరం నియోజకవర్గంలో ఒకసారి ఎమ్మెల్యేగా, మరోసారి మంత్రిగా ప్రాతినిధ్యం వహించిన మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వర రావు టీడీపీలో పట్టుకోల్పోతున్నట్లు కనిపిస్తోంది. నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రవేశిస్తున్న సందర్భంగా ఆయన ప్రధాన అనుచరుడు గన్నే ప్రసాద్ (అన్నా) మాజీ మంత్రి ఉమా ఫొటో లేకుండానే ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం చర్చనీయాంశమైంది. ఈ పరిణామాలతో టీడీపీ నాయకులు, కార్యకర్తల్లో నిరుత్సాహం నెలకొంది. ఇప్పటికే గొల్లపూడికి చెందిన బొమ్మసాని సుబ్బారావు మైలవరం టీడీపీ సీటు నాదే అన్న పంథాలో చాపకింద నీరులా ప్రచారం చేసుకుంటున్నాడు. ఇప్పుడు గన్నే ప్రసాద్ రూపంలో మరో అసమ్మతి వర్గం తెరపైకి వచ్చింది. నియోజకవర్గంలో గతంలో ఉమా వెనుకఉన్న ప్రధాన అనుచరలు ఒక్కొక్కరుగా దూరమవడంతో ఉమా ఒంటిరి అయ్యారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

ఏటి కాలువ పూడిక తీత పనులు ప్రారంభం



గుళ్లపూడిలో ఏటి కాలువకు పూడిక తీత పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ముసునూరు: గుళ్లపూడి, గుడిపాడు, వలసపల్లి, యల్లాపురం గ్రామాల వ్యవసాయ క్షేత్రాలకు తమ్మిలేరు నుంచి నీరందించే ఏటి కాలువలోని పూడిక తీత పనులు ప్రారంభించినట్లు సర్పంచ్ ఆర్.శ్రీదేవి శ్రీనివాస్ తెలిపారు. ఏటి కాలువ పూడిక, ముళ్ల పొదలతో నిండిపోవడంతో రైతులు ఈ విషయాన్ని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే జేసీబీ పంపించడంతో శుక్రవారం నీటి సంఘ అధ్యక్షుడు వలసపల్లి రామచంద్రప్రసాద్ కొబ్బరికాయ కొట్టి పూడిక తీత పనులు ప్రారంభించారు. రైతులంతా ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేంపాటి పద్మజా రాంబాబు, రైతు నేత రంగారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జి.కొండూరు: మండల పరిధి జి.కొండూరు, కుంటముక్కల విద్యుత్ సబ్‌స్టేషన్లలో నెలవారీ మరమ్మతులు చేపట్టేందుకు శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏఈ రామ్మోహన్‌రావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా కళాకారుడు గద్దర్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): ప్రజా కళాకారుడు, అమరజీవి గద్దర్ తన 50 సంవత్సరాల ఉద్యమ చరిత్రలో విప్లవ రాజకీయాల వైపు యువతను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించారని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్.శర్మ అన్నారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కవి అధ్యక్షతన శుక్రవారం గద్దర్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శర్మ మాట్లాడుతూ పాటను ఆయుధంగా మలుచుకొని గద్దర్ ప్రజల పక్షాన నిలిచారన్నారు. నిరంతరం ప్రజలతో ఉంటూ ప్రజల పక్షం వహిస్తూ ఎక్కడికక్కడే పాటలు రాసుకొని ప్రజా బాణీలను పాటలకు చెప్పించడం గద్దర్ గొప్పతనమని కొనియాడారు. గద్దర్ బాటలో అనేక మంది ప్రజాకవులు, కళాకారులు పుట్టుకొచ్చారని తెలిపారు. గద్దర్ మన తెలుగువాడు కావడం మనందరికీ గర్వకారణమన్నారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్‌కుమార్ మాట్లాడుతూ గద్దర్ లేని లోటు ప్రజా సాంస్కృతిక ఉద్యమానికి తీరని లోటని పేర్కొన్నారు. ప్రజల పాటల్లో ప్రజా కళారూపాల్లో గద్దర్ ఎన్నటికీ నిలిచి ఉంటారన్నారు. సభకు ముందుగా గద్దర్ చిత్రపటానికి సీనియర్ గాయకుడు ఎ.జగన్ పూలమాలవేసి నివాళులర్పించారు. అభ్యుదయ పాటలతో జోహార్లు అర్పించారు.

ఎస్‌ఎఫ్‌ఐ సమావేశాలను జయప్రదం చేయాలి

ఏ.కొండూరు: ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్లీనరి సమావేశాలను జయప్రదం చేయాలని కోరుతూ ఏ. కొండూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వాల్‌పోస్టర్‌ను ఆ సంఘ నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు మాట్లాడుతూ ఈ నెల 19, 20వ తేదీలలో విజయవాడలో సమావేశాలు జరుగుతాయన్నారు. విద్యారంగం పరిరక్షణ, శాస్త్రీయ విద్యా విధానం, విద్యాహక్కు చట్టం తదితర అంశాలపై సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు బట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఏ.కొండూరు: స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా రూ. 50లక్షలతో నూతనంగా నిర్మించే ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణానికి సంబంధించి స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి శనివారం ఉదయం 10 గంటలకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపీపీ కాలసాని నాగలక్ష్మి శుక్రవారం తెలిపారు. చైతన్య నగర్‌లో గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఒక రూ.కోటీ 50లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

యోగా టీచర్‌కు అవార్డు




సాదు వెంకమ్మకు లభించిన అవార్డు

గంపలగూడెం: గంపలగూడెంకు చెందిన యోగా టీచర్ సాదువెంకమ్మకు బెంగళూరుకు చెందిన బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్, ఆదత్యసాయి, శివజ్యోతి యోగా సెంటర్ల సంయుక్త ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో 2023 సంవత్సరానికి జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీలో అవార్డు లభించింది. 50–60 సంవత్సరాల విభాగంలో జాతీయ స్థాయిలో ఎంపికై న ఆరుగురిలో వెంకమ్మ ఉన్నారు. ఆమెకు నిర్వాహకులు మెమొంటో, ప్రశంసాపత్రం పంపారు.

పాల వెల్లువతో బహుళ ప్రయోజనాలు

ఆంజనేయపురం(తిరువూరురూరల్): జగనన్న పాలవెల్లువ కార్యక్రమంతో గ్రామాల్లో పాల ఉత్పత్తిదారులకు పలు ప్రయోజనాలున్నాయని తిరువూరు మండల వెలుగు ఏపీఎం గురవయ్య తెలిపారు. మండలంలోని ఆంజనేయపురం సచివాలయం వద్ద శుక్రవారం జగనన్న పాలవెల్లువపై డ్వాక్రా గ్రూపు మహిళలకు, మహిళా పాల ఉత్పత్తిదారులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ పథకంలో పాలు పోసేవారికి బ్యాంకుల ద్వారా రుణసదుపాయం, పశువులకు, పాడిరైతులకు బీమా సదుపాయం కల్పిస్తారన్నారు. గ్రామ సర్పంచ్ మామిడి కుటుంబరావు, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యురాలు కోటేశ్వరి, టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్ ముక్కామల సీతారామయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్, పశువైద్యాధికారి స్వప్న, రూట్ ఇన్‌చార్జి జ్యోతిర్మయి పాల్గొన్నారు.

బోనస్ విడుదల



బోనస్ చెక్‌ను అందజేస్తున్న సాంబమూర్తి

రెడ్డిగూడెం: మండలంలోని శ్రీరామపురం గ్రామంలో మొదటి విడత కృష్ణామిల్క్ యూనియన్ ధర వ్యత్యాసం రూ. 1,74,133లు, ముచ్చనపల్లి సంఘంలో రూ.1,46,871 బోనస్‌ను పాల కేంద్రం మేనేజర్ సాంబశివమూర్తి శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృష్ణామిల్క్ యూనియన్ మొదటి విడత రూ. 15కోట్ల బోనస్‌ను ఇవ్వగా దానిలో తిరువూరు క్లస్టర్ పరిధిలో ఒక రూ.కోటీ 80 లక్షలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శ్రీరామపురం సంఘం అధ్యక్షుడు భాస్కరరావు, ముచ్చనపల్లి సంఘం అధ్యక్షుడు సాంబశివరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



చెక్కును అందజేస్తున్న దాత సోదరుడు

ముసునూరు: ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థికి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని విశ్రాంత హెచ్‌ఎం తోటకూర సాంబశివరావు పేర్కొన్నారు. మైలవరంలోని ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ముసునూరు విద్యార్థి చిట్టూరి యశ్వంత్‌కు గ్రామానికే చెందిన ప్రవాసాంధ్రుడు, దేవినేని విజయనారాయణ అతని సోదరుడు సాంబశివవరప్రసాద్ ద్వారా ఈ విద్యా సంవత్సర అవసరాల నిమిత్తం రూ.20,000 చెక్కును శుక్రవారం విద్యార్థికి అందజేశారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కాకర్ల(తిరువూరు): మండలంలోని కాకర్లలో ఎస్సీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి నవీన్ నేతృత్వంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. తిరువూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే కే రక్షణనిధి వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేదలకు ఉపయోగపడుతున్నాయని, ఎస్సీలకు లబ్ధి చేకూరే విధంగా పథకాలు అమలు చేస్తున్నారని కాకర్లకు చెందిన కోట చిన రాములు పేర్కొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సర్వం సిద్ధం

- నూజివీడు నియోజకవర్గంలో నేడు పోలింగ్
- ఒక పంచాయతీ, 3వార్డులకు పోటీ



అడవినెక్కలం పోలింగ్ స్టేషన్‌కు ఎన్నికల సామగ్రిని తీసుకెళ్తున్న సిబ్బంది



ఎర్రమాడు ఎంపీయూపీ స్కూల్లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నూజివీడు: నియోజకవర్గంలో పలు గ్రామాల్లో ఈ నెల 19వ తేదీన నిర్వహించే పంచాయతీ ఎన్నిక, వార్డు సభ్యుల ఎన్నిక నిర్వహణకు సంబంధించి అధికారులు సర్వం సిద్ధం చేశారు. సర్పంచ్, వార్డు సభ్యులకు నిర్వహించే ఎన్నికలకు గాను ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహించి, అనంతరం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నారు. ఆగిరిపల్లి మండలం అడవి నెక్కలం పంచాయతీ సర్పంచ్ పదవికి, నూజివీడు మండల అన్నవరం పంచాయతీలో 5వ వార్డు సభ్యుని ఎన్నికకు, ముసునూరు మండలం కాట్రేనిపాడులో 10వ వార్డు సభ్యుని పదవికి, ముసునూరులో 11వ వార్డు సభ్యుడికి సంబంధించి ఎన్నికలు నిర్వహించనున్నారు.

అడవినెక్కలం సర్పంచ్ పదవికి బరిలో ముగ్గురు

ఆగిరిపల్లి మండలం అడవినెక్కలం సర్పంచ్ పదవికి ముగ్గురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇక్కడ సర్పంచ్ పదవి ఎస్సీ కేటగిరికి రిజర్వేషన్ కాగా పిల్లి శేషయ్య, పులపాక చిన్నబ్బాయి, వేము రాజులో పోటీలో ఉన్నారు. ఇక్కడ మొత్తం ఓటర్లు 1,616మంది కాగా వీరిలో పురుషులు 781 మంది, మహిళలు 835 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం గ్రామంలో మూడు పోలింగ్‌స్టేషన్లను ఏర్పాటు చేయడంతో పాటు పోలింగ్ నిర్వహణ కోసం 12మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. ముసునూరు మండలం కాట్రేనిపాడులో 10వ వార్డుకు కాజా రాజ్యలక్ష్మి, పేరేచర్ల రంగారావు, ముసునూరులోని 11వ వార్డుకు కొడవటి వనిత, కలపాల నలోమి, నూజివీడు మండలం అన్నవరంలో 5వ వార్డుకు పులపాక పుల్లారావు, ప్రత్తిపాటి జోజి పోటీలో ఉన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేడు వార్డుసభ్యుడి ఉప ఎన్నిక

తిరువూరు: మండలంలోని ఎర్రమాడు గ్రామపంచాయతీ ఏడో వార్డు సభ్యుడి పదవికి ఉప ఎన్నిక శనివారం జరగనుంది. ఈ వార్డుసభ్యుడిగా ఉన్న నవభోజరాజు మృతితో ఏర్పడిన ఖాళీ భర్తీకి ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అధికారులు ఏర్పాట్లు చేశారు. చలివేంద్రం హరిబాబు, వేము మార్తారావు నామినేషన్లు దాఖలు చేయగా, పోటీ నెలకొంది. ఈ వార్డులో మొత్తం 136 ఓట్లుండగా, శనివారం ఉదయం ఏడు నుంచి ఒంటిగంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల అధికారిగా గంపలగూడెం మండల వ్యవసాయాధికారి సబిత వ్యవహరిస్తున్నారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు నిర్వహించి ఫలితం ప్రకటించనున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. పోలింగ్ కేంద్రం వద్ద బందోబస్తును ఏసీపీ రమేష్, సీఐ భీమరాజు, ఎస్ఐలు శుక్రవారం పరిశీలించారు.

ఎన్నికల సామగ్రి అందజేత

ముసునూరు: రెండు గ్రామాల్లోని రెండు వార్డుల ఉప ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. శుక్రవారం సిబ్బందికి ఎన్నికల సామగ్రిని అందజేశారు. అనంతరం ఆమె అధికారులతో కలిసి, ముసునూరు, కాట్రేనిపాడుల్లోని ఎన్నికల కేంద్రాలను పరిశీలించి, అవకతవకలకు తావులేకుండా, ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు, కౌంటింగ్‌ను నిర్వహించి, ఫలితాలను వెల్లడించాలని సిబ్బందికి సూచించారు. ముసునూరులోని 11వ వార్డుకు కొడవలి వనిత, కలపాల నలోమి కాట్రేనిపాడులో 10వ వార్డుకు పేరిచర్ల రంగారావు, కాజ రాజ్యలక్ష్మి పోటీలో ఉన్నారు. శనివారం నిర్వహించనున్న ఉప ఎన్నికలో రెండు వార్డుల్లో నలుగురు అభ్యర్థులు పోటీతో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.